చెక్కును అందజేస్తున్న మంత్రి భరత్, డిఇఒ శ్యామూల్ పాల్, జెసి నవ్య

ఈసారీ 'కంది'పోయిన రేషన్

- ఏడు నెలలుగా అందని కందిపప్పు
- రేషన్‌లో సరుకుల్లో కొనసాగుతున్న కోత

ప్రజా పంపిణీ వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొస్తామని, ప్రక్షాళన చేస్తామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి మనోహర్ మొదటి నుంచి సమీక్షల్లోనూ చెబుతూనే ఉన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్ది కూటమి సర్కారు ప్రజా పంపిణీ వ్యవస్థను గాడిలో పెడుతుందంటూ చెప్పుకొచ్చారు. అయితే ఆచరణలో పూర్తి స్థాయిలో సరుకుల పంపిణీపై దృష్టి సారించలేకపోతున్నారు. ఏడు నెలలుగా రేషన్‌లో కందిపప్పు సరఫరా కావట్లేదు. కేవలం బియ్యం, పంచదారతోనే సరిపెడుతున్నారు...

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కర్నూలు జిల్లాలో 1,228 రేషన్ షాపులు ఉండగా వాటి పరిధిలో 6,76,209 రేషన్ కార్డులు ఉన్నాయి. నంద్యాల జిల్లాలో 5,41,804 రేషన్‌కార్డులు ఉన్నాయి. వాటికి నెలనెలా బియ్యం, కందిపప్పు, పంచదార పంపిణీ చేయాల్సి ఉంది. ఏడు నెలలుగా కందిపప్పు కేటాయించడం లేదు. ఒక్కో కార్డుకు కిలో కందిపప్పు ఇవ్వాల్సి ఉంది. ఈ లెక్కన నెలకు కర్నూలు జిల్లాకు 676.209 మెట్రిక్ టన్నులు, నంద్యాల జిల్లాకు 541.804 మెట్రిక్ టన్నుల కందిపప్పు అవసరం ఉంది. జిల్లాలో కొన్ని నెలలుగా కందిపప్పు సరఫరా పూర్తిస్థాయిలో జరగడం లేదు. ఫిబ్రవరి నెలలో 30 శాతం కార్డులకు బఫర్ స్టాక్ నుంచి పంపిణీ చేశారు. మార్చి నెలలో అసలు ఎలాంటి కేటాయింపులు చేయలేదు. ఏప్రిల్ నెలలోనూ అదే పరిస్థితి నెలకొంది. దీంతో జిల్లాలో ఒక్క లబ్ధిదారునికి కూడా కందిపప్పు ఇవ్వడం లేదు. కందిపప్పు పూర్తిగా నిలిపివేయడంతో పేదలు పప్పుచారుకు కూడా దూరమయ్యారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా లబ్ధిదారులకు సరఫరా చేయాల్సిన సరుకులను ప్రభుత్వం క్రమంగా తగ్గిస్తూ వస్తుంది. గతంలో టిడిపి ప్రభుత్వం క్రిస్మస్, సంక్రాంతి కానుక, రంజాన్ తోఫా అంటూ అవసరమైన సరుకులను రేషన్ షాపుల ద్వారా ఇచ్చేవారు. 2019లో వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత బియ్యం మాత్రమే పూర్తిస్థాయిలో ఇచ్చారు. ప్రతి నెలా కందిపప్పు అరకొరగానే పంపిణీ చేశారు. పండుగ తోఫాలకు ఫుల్‌స్టాఫ్ పెట్టారు. ఈ ఏడాది జూన్లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పౌరసరఫరాల శాఖపై నిర్వహించిన సమీక్ష సందర్భంగా అన్ని సరుకులను పంపిణీ చేయనున్నట్లు ప్రకటించారు. కాని ప్రస్తుతం పరిస్థితి భిన్నంగా ఉంది. కనీసం కందిపప్పు కూడా సరఫరా చేయకపోవడంతో లబ్ధిదారుల్లో నిరాశే మిగిలింది. ఉగాది, రంజాన్ పండుగలకు ప్రభుత్వం అన్ని రేషన్ సరుకులను ఇస్తుందని లబ్ధిదారులు ఆశించినా నిరాశే ఎదురైంది.

బహిరంగ మార్కెట్లో కొనలేక

ప్రజలు నిత్యం వాడే కందిపప్పు నాణ్యతను బట్టి ధర రూ.110 నుంచి 150 వరకూ ఉంది. రాయితీ పోను కిలో కందిపప్పు రూ.67కే లభిస్తున్నందున రేషన్ షాపుల ద్వారా కందిపప్పు పంపిణీ చేయాలని లబ్ధిదారులు కోరుతున్నా కూటమి సర్కారు సైతం పట్టించుకోవడం లేదు. కందిపప్పు ధర భారీగా పెరగడంతో పేద, మధ్య తరగతి ప్రజలు కొనలేని స్థితిలో ఉన్నారు. ఇప్పటికే నిత్యవసర సరుకుల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. దానికి తోడు పేదలపై భారాలు రోజురోజుకి ఎక్కువ అవుతున్నాయి. దీంతో కందిపప్పు కొనుగోలు చేయలేని దుస్థితి ఏర్పడింది. నిత్యావసర వస్తువుల ధరలు తగ్గిస్తున్నామనే పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా రైతు బజార్ల ద్వారా ప్రభుత్వం కందిపప్పు పంపిణీ చేపట్టింది. అది నాణ్యత తక్కువగా ఉండడంతో వినియోగదారులు కొనుగోలు చేసేందుకు అంతగా ఆసక్తి చూపడం లేదు. బహిరంగ మార్కెట్లో ఉన్న ధరపై రూ.10 నుంచి రూ.20 వరకు కిలోపై ధర తగ్గిస్తున్నా, ఇది రెండో రకం కందిపప్పు కావడంతో తీసుకునేందుకు ఎవరూ ఇష్టపడడం లేదు.

పేదల బతుకులు మారడం లేదు

-లక్ష్మి, కుమ్మరి వీధి కర్నూలు.

పాలకులు మారినా పేదల బతుకులు మారడం లేదు. గతంలో టిడిపి ప్రభుత్వం తెల్ల రేషన్ కార్డుదారులకు బియ్యం, కందిపప్పు, ఉప్పు, కారం, చక్కెర, జొన్నలు, గోధుమలు, చింతపండు లాంటి నిత్యవసర సరుకులు రేషన్ షాపుల ద్వారా ఇచ్చేవారు. ప్రభుత్వాలు మారే కొద్దీ పేదలకు ఇచ్చే నిత్యవసర సరుకులు ఒక్కొక్కటి తగ్గిస్తూ వచ్చారు. ప్రస్తుతం బియ్యము, చక్కెర తప్ప ఏ సరుకులూ ఇవ్వడం లేదు. కందిపప్పు కూడా మూడు నెలలుగా ఇవ్వడం లేదు. బయటకుందామంటే సామాన్య ప్రజలకు నిత్యవసర ధరలు చుక్కలను అంటుతున్నాయి. టమాటా చారు చేసుకుని చట్నీ నూరు కొని అన్నంలో కలుపుకుని తినాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రజలకు నిత్యావసర సరుకులు ఇచ్చి ఆదుకోవాలి.

సరుకులు ఇచ్చి ఆదుకోవాలి

- పద్మ, పెద్ద మార్కెట్, కర్నూలు.

మూడు నెలలుగా రేషన్ షాపుల ద్వారా ఇచ్చే కంది బేడలు ఇవ్వడం లేదు. దీంతో పప్పు వండుకునే పరిస్థితి లేకుండా పోయింది. భార్యాభర్తలం పగలంతా కష్టపడితే వచ్చే డబ్బులతో కుటుంబం మొత్తం కడుపునిండా మూడు పూటలా తిండి కరువైంది. పిల్లలకు మూడు పూటలా పెట్టి పెద్దలు ఒక పూట తిని పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. కూటమి ప్రభుత్వం పేదల కోసం నిత్యవసర సరుకుల ధరలు తగ్గించాలి లేదా రేషన్ షాపుల ద్వారా ఇచ్చే సరుకులైనా తక్కువ ధరలకు అందించి ఆదుకోవాలి.

త్వరలో పైలెట్ శిక్షణ కేంద్రం ప్రారంభం

- విద్యార్థులకు ఇష్టమైన కోర్సులను అభ్యసించాలి
- మంత్రి టిజి భరత్
- షైనింగ్ స్టార్స్ అవార్డ్స్ కింద విద్యార్థులకు పురస్కారాలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఓర్వకల్లులో త్వరలోనే పైలెట్ శిక్షణ కేంద్రం ప్రారంభమవుతుందని పరిశ్రమల శాఖ మంత్రి టిజి.భరత్ అన్నారు. పైలెట్ శిక్షణ పూర్తి చేసుకున్న తర్వాత మెరుగైన ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు. విద్యార్థులు తమకు ఇష్టమైన కోర్సులను మాత్రమే అభ్యసించాలని కోరారు. తల్లిదండ్రులు వారి కోరికలను పిల్లలపై ఒత్తిడి చేయరాదన్నారు. సోమవారం కర్నూలు నగర శివారులోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో విద్యాశాఖ ఆధ్వర్యంలో 10వ తరగతి, ఇంటర్మీడియట్‌లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు షైనింగ్‌స్టార్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ప్రతిభా పురస్కారాలను అందజేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.శామ్యూల్ పాల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి టిజి. భరత్ , ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి , జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య పాల్గొన్నారు. విద్యార్థులను ఉద్దేశించి మంత్రి టిజి. భరత్ మాట్లాడుతూ ఉత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రతిభా పురస్కారం అవార్డుతో పాటు రూ. 20 వేలు, సర్టిఫికేట్ అందజేశామన్నారు. షైనింగ్ స్టార్స్‌గా ఎంపికైన వారు మిగతా విద్యార్థులకు స్ఫూర్తిని కలిగిస్తారన్నారు. ప్రస్తుత సాంకేతిక పద్ధతులను మరింత అధ్యయనం చేసి ఉత్తమ విద్యాభ్యాసం చేసేందుకు వినియోగించుకోవాలని కోరారు. ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి మాట్లాడుతూ... తన నియోజకవర్గ పరిధిలోని కాలవబుగ్గ రెసిడెన్షియల్ పాఠశాలలో మెరుగైన విద్యాబోధన అందించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. చిన్నటేకూర్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయం ఐఐటి అకాడమీ కూడా పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. జాయింట్ కలెక్టర్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు చాలామంది మంచి మార్కులు సాధించారన్నారు. ఇదే స్ఫూర్తిగా తీసుకొని చాలామంది తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న జూనియర్ విద్యార్థులు కూడా మిమ్మల్ని స్ఫూర్తిగా తీసుకొని ఇదేవిధంగా మంచి మార్కులు సాధించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో అన్ని రకాల మౌలిక సదుపాయాలు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. అనంతరం ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో చదివి పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చాటిన 142 మంది విద్యార్థులకు, అ ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలో చదివి ఇంటర్మీడియట్ బోర్డు పరీక్షల్లో ప్రతిభ చాటిన 35 మంది విద్యార్థులకు మంత్రి, జాయింట్ కలెక్టర్, పాణ్యం ఎమ్మెల్యే మెడల్, సర్టిఫికెట్ అందజేసి రూ.20 వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో కర్నూలు ఆర్‌డిఒ సందీప్ కుమార్, జిల్లా ఇంటర్మీడియట్ బోర్డు అధికారి సురేష్, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

- కలెక్టరేట్ ఎదుట కార్మిక సంఘాల నిరసన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

విశాఖ ఉక్కు పరిశ్రమలో అన్యాయంగా తొలగించిన 2500 మంది కాంట్రాక్ట్ కార్మికులను విధులలోకి తీసుకోవాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సిఐటియు, ఎఐటియుసి నగర కార్యదర్శులు సిహెచ్.సాయిబాబా, జి.చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి. అంజిబాబు, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మునెప్ప మాట్లాడుతూ కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు విశాఖ ఉక్కు పరిశ్రవ ను ఆదుకోవడంలో విఫలం చెందాయన్నారు. కేంద్ర మంత్రి కుమారస్వామి విశాఖ ఉక్కు పరిశ్రమను అభివృద్ధి చేస్తామని చెబుతూనే మరోపక్క నిర్వీర్యం చేసేందుకు కుట్రపన్నారన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమ లో తొలగించిన 2,500 మంది కాంట్రాక్టు కార్మికులను తక్షణమే విధులకు తీసుకోవాలన్నారు. విశాఖకు ఫ్యాక్టరీకి సొంత గనులు కేటాయించాలనివారు డిమాండ్ చేశారు, సమ్మె చేస్తున్న కార్మికులపై పోలీసుల వేధింపులను ఆపాలని కోరారు. ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు బతకన్న, ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు భాస్కర్ మాట్లాడారు . ఈ కార్యక్రమంలో సిఐటియు ఓల్డ్ సిటీ కార్యదర్శి విజయ రామాంజనేయులు, నగర నాయకులు మహమూద్, దూదకొండ కుమార్, ఎఐటియుసి నగర నాయకులు బి.వెంకటేష్, టి. రామాంజనేయులు, ఆర్.కృష్ణారెడ్డి, బిఐఎఫ్‌టియు నాయకులు సురేష్ నాయక్, రాజు, ఐఎన్‌టిసి నాయకులు ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

నిరసననుద్దేశించి మాట్లాడుతున్న నాయకులు

పొలాల దారులను మరమ్మతులు చేయండి

- ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం వినతి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

గుంతలు పడి కల్వర్టులు కొట్టుకుపోయిన రైతుల పొలాల దారులను మరమ్మతులు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఉల్చాల గ్రామ రైతులతో కలిసి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చిరంజీవికి ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ వినతిపత్రం అందజేశారు. కర్నూలు మండలం ఉల్చాల గ్రామంలో రైతులు పొలాలకు వెళ్లే దారులు పెద్దపాడు రోడ్డు, గోకులపాడు రోడ్డు, సల్కాపురం రోడ్డు, గూడూరు రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయని తెలిపారు. అనేకసార్లు అధికారులకు తెలియజేసినప్పటికీ స్పందించలేదని తెలిపారు. గ్రామంలో 4000 మంది రైతులు వ్యవసాయం చేస్తున్నారని, వారికి అనుబంధంగా వందల మంది వ్యవసాయ కూలీలు పనిచేస్తున్నారని, ప్రతిరోజు ఆ దారిలో వెళ్లలేక ప్రమాదాలకు గురవుతున్న పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. వర్షాలు కురిసినప్పుడు రోడ్లు కోతకు గురవుతున్నాయని, కల్వర్టులు కొట్టుకుపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. వెంటనే ఆ సమస్యపై స్పందించి రోడ్లు మరమ్మతులు చేయించాలని రైతులు ప్రమాదాలకు గురికాకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో డివైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర , గ్రామ రైతులు కృష్ణ శ్రీనివాసరెడ్డి, భీమేష్, హరికిషన్, అంజి, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న రైతుసంఘం నాయకులు రామకృష్ణ

ర్యాలీని ప్రారంభిస్తున్న జెసి నవ్య

యోగాంధ్ర ర్యాలీ నిర్వహణ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

యోగాంధ్ర క్యాంపెయిన్‌లో భాగంగా సోమవారం ఉదయం కలెక్టరేట్ కలెక్టరేట్ నుండి రాజవిహార్ వరకు ర్యాలీ నిర్వహించారు. మూడు రంగుల బెలూన్లను గాలిలోకి వదిలి ర్యాలీని జాయింట్ కలెక్టర్ బి.నవ్య ప్రారంభించారు. కర్నూలు మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, డి టిసి శాంత కుమారి, డిఎస్‌ఒ రాజా రఘువీర్, డిఎంహెచ్‌ఒ శాంతి కల, హౌసింగ్ పిడి చిరంజీవి, డిసిఒ రామాంజనేయులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, సెట్కూర్ సిఇఒ వేణుగోపాల్ , డిఆర్‌డిఎ పిడి రమణా రెడ్డి, ఉద్యోగులు , ప్రజలు పాల్గొన్నారు.

టిఫా ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ కె వెంకటేశ్వర్లు, డాక్టర్

అందుబాటులోకి టిఫా స్కాన్ సేవలు

ప్రారంభించిన సూపరింటెండెంట్ డాక్టర్ కె వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి- కర్నూలు హాస్పిటల్

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో న్యూ డయాగ్నోస్టిక్ బ్లాక్‌లో ఉన్న టిఫాస్కాన్ టెస్టును సోమవారం హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ కె .వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గర్భిణులకు గర్భంలోని శిశువు ఎదుగుదల వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునే టిఫా స్కాన్ ప్రారంభించి ఈ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. తల్లీ బిడ్డల ఆరోగ్యమే ప్రధాన లక్ష్యంగా తీసుకుంటున్న చర్యల్లో భాగంగా గర్భిణులకు ఓపి దగ్గరే టిఫా స్కానింగ్ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చామని అన్నారు. టిఫా స్కానింగ్ అందుబాటులోకి తీసుకొచ్చినందుకు ఆసుపత్రి సూపరిండెండెంట్‌కు రేడియాలజీ, గైనిక్ హెచ్‌ఒడిలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరాములు, సిఎస్ఆర్ఎంఒ డాక్టర్ వెంకటేశ్వరరావు, అడ్మినిస్ట్రేటర్ రేడియాలజీ హెచ్‌ఒడి డాక్టర్ రాధా రాణి, గైనిక్ హెచ్‌ఒడి డాక్టర్ శ్రీలక్ష్మి, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ డాక్టర్ కిరణ్ కుమార్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను, మార్కెట్ యార్డు ఛైర్మన్‌ను సత్కరిస్తున్న నాయకులు , కార్యకర్తలు

మార్కెట్ యార్డ్ ఛైర్మన్‌గా నబీసాహెబ్ ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి-పత్తికొండ

పత్తికొండ వ్యవసాయం మార్కెట్‌లో పత్తికొండ ఎమ్మెల్యే కెఇ.శ్యామ్ కుమార్ ఆధ్వర్యంలో పత్తికొండ వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ గా క్రిష్ణగిరి మండలం అలంకొండ గ్రామానికి చెందిన నబీసాహెబ్ సోమవారం అట్టహాసంగా ప్రమాణస్వీకారం చేశారు. మార్కెట్ యార్డులో ఛైర్మన్ ,వైస్ ఛైర్మన్ , డైరెక్టర్లతో పాటు 20 మంది పాలకవర్గం సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం ఛైర్మన్ నబీసాహెబ్ మాట్లాడుతూ వ్యవసాయ మార్కెట్ యార్డ్ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని అన్నారు. మార్కెట్ యార్డ్ లోని సమస్యలు ఏవైనా ఉంటే తమ తృష్టికి తీసుకురావాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. నాపై ఎంతో నమ్మకంగా ఉన్నత పదవీ బాధ్యతలు అప్ప జెప్పినందుకు పత్తికొండ ఎమ్మెల్యే కెఇ శ్యామ్ కుమార్‌కు రుణపడి ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ సెక్రటరీ కార్నలిస్, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు సాంబశివరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజనరీ-చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యం

నియోజకవర్గ దార్శనికత కార్యాచరణ కార్యాలయం ప్రారంభించిన మంత్రి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నియోజకవర్గ విజన్ బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి టిజి.భరత్, కమిషనర్ రవీంద్రబాబు

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు విజనరీతోనే రాష్ట్రం అన్ని విధాలా ప్రగతి పథంలో పయనిస్తుందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల మంత్రి టిజి.భరత్ అన్నారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో కర్నూలు నియోజకవర్గ యూనిట్ దార్శనికత కార్యాచరణ కార్యాలయాన్ని మంత్రి, కమిషనర్ ఎస్.రవీంద్ర బాబుతో కలిసి ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ.. విజన్ అనగానే అందరికీ చంద్రబాబే గుర్తు వస్తారని, చంద్రబాబు రెండోసారి ముఖ్యమంత్రి అయ్యాక 'విజన్ ఎ 2020' కు శ్రీకారం చుట్టారని, దాని ఫలితంగానే హైదరాబాద్ విశ్వనగరంగా ప్రఖ్యాతి గాంచిందని పేర్కొన్నారు. ముందుచూపుతో పనిచేస్తేనే భావితరాలకు మంచి ఫలితాలు చూస్తారన్నారు. అందులో భాగంగానే ముఖ్యమంత్రి విజన్-2047 కార్యక్రమానికి నాంది పలికారని తెలిపారు. రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయిల్లో ప్రజలు, ప్రజాప్రతినిధుల నుండి అభిప్రాయాలను తీసుకొని, వాటికి విజన్ డాక్యుమెంటరీ రూపొందించి, వాటి అమలుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. దీంతో స్పష్టమైన దిశానిర్దేశంతో ప్రజాప్రతినిధులు, అధికారులు పనిచేస్తారన్నారు. భవిష్యత్తులో వాటి ఫలితాలను చూస్తామన్నారు. ఒకొక్క నియోజకవర్గానికి ఐదుగురు విద్యావంతులతో సాధికార బృందాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, వారు నియోజకవర్గ అభివృద్ధికి కార్యాచరణ అమలు కోసం పనిచేస్తారని, ఫలితంగా వారి పనితీరు నియోజకవర్గ అభివృద్ధికి దోహదపడుతుందని మంత్రి పేర్కొన్నారు. కమిషనర్ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధిని, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని, గతంలో విజయవంతమైన విజన్-2020 తరహా, మళ్లీ ఇప్పుడు విజన్-2047 కి ముఖ్యమంత్రి చంద్రబాబు నాంది పలికారన్నారు. నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర యూనిట్లుగా విభజించి, ప్రత్యేక సాధికార బృందాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందన్నారు. సాధికార బృందాలకు ఒక కార్యాలయం ఉండాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు తాత్కాలిక కార్యాలయాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. త్వరలో అన్ని వసతులతో శాశ్వత కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. అదనపు కమిషనర్ ఆర్‌జివి కృష్ణ, మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్‌రెడ్డి, ఇంచార్జ్ ఎస్‌ఇ శేషసాయి, పారిశుధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు, కార్పొరేటర్ కురుబ పరమేష్, పాల్గొన్నారు.

కోడుమూరు విజన్ 2047 ఆఫీసు ప్రారంభం

అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

ప్రజాశక్తి - కోడుమూరు రూరల్

కోడుమూరు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దస్తగిరి

స్వర్ణాంధ్ర 2047 విజన్ ప్రణాళిక నియోజకవర్గ కార్యాలయంను ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి కోడుమూరులో సోమవారం ప్రారంభించారు. ఎపిని ఉన్నత స్థానంలో నిలపడమే సీఎం చంద్రబాబు లక్ష్యమని ఎమ్మెల్యే అన్నారు. 175 మంది ఎమ్మెల్యేలతో వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. స్వర్ణాంధ్ర 2047 లక్ష్యసాధనలో భాగంగా నియోజకవర్గ స్థాయిలో ప్రణాళికలు రూపొందించాలని ప్రజా ప్రతి నిధులకు, అధికారులకు సూచించారు. ఆర్‌డిఒసందీప్ కుమార్ మాట్లాడుతూ కోడుమూరు నియోజకవర్గం యాక్షన్ ప్లాన్‌తయారు చేశామన్నారు.మూడు రంగాల అభివృద్ధి చెందాలని వివరించారు. అవి వ్యవసాయం 41 శాతం, పరిశ్రమలు 30 శాతం, సర్వీస్ సెక్టార్ 28 శాతం అభివృద్ధి చెందేటట్లు ప్రణాళిక రూపొందించామన్నారు. తహశీల్దార్ వెంకటేష్ నాయక్, ఎంపిడిఒ రాముడు పాల్గొన్నారు.

అధిక ఫీజులు వసూలు చేసే కళాశాలలపై చర్యలు

స్పెషల్ కలెక్టర్‌కు ఎస్ఎఫ్ఐ వినతి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

గ్రీవెన్స్‌లో స్పెషల్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

జిల్లాలో అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్,కార్పొరేట్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అబ్దుల్లా రంగప్ప డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్లో గ్రీవెన్స్ కార్యక్రమంలో స్పెషల్ కలెక్టర్ వెంకటేశ్వర్లుకు ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లాలో ఇష్టా రాజ్యంగా ఇంటర్మీడియట్ బోర్డు నిబంధనలకు విరుద్ధంగా కళాశాలలు నిర్వహిస్తున్నా రన్నారు. ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్, శానిటరీ, స్ట్రక్చరల్ సాండ్నెస్ సర్టిఫికెట్, నో అబ్జెక్షన్ సర్టిఫికేట్ లేకపోయినా పరికరాలతో కూడిన ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ ల్యాబ్స్, లైబ్రెరీ, లేపోయిన విద్యార్థులకు తరగతులు జరుగుతున్నాయన్నారు. నియాన్ ఐసి, నియాన్ పార్క్, ఎన్‌పిఎల్, సూపర్ -60, సి -120, మెడికన్, ఎయిమ్స్-160, సూపర్ చైనా, కోస్ పార్క్ జెడ్ స్ట్రీట్, ఎన్ఎంపిఎల్ స్పార్క్, జెఇ, నీట్, షార్ట్ టర్మ్, లాంగ్ టర్మ్ పేర్లతో సెక్షన్ల విద్యార్థుల తల్లిదండ్రుల నుండి రూ.లక్షల వసూలు చేస్తున్నారన్నారు. కళాశాలలు అన్నీ కూడా కమర్షి యల్ కాంప్లెక్స్‌లోనే నడపడం వల్ల విద్యార్థులు కళాశాలకు వచ్చే సందర్భం లోనూ తిరిగి వెళ్లే సందర్భం లోనూ ట్రాఫిక్ సమస్యలతో తీవ్ర ఇబ్బం దులు పడుతున్నా రన్నారు. కళాశాలలోనే పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్త కాలు, యూనిఫామ్, షూ, బెల్ట్, ఇతర స్టేషనరీ విక్రయిస్తూన్నారాన్నారు. వి ద్యార్థులు మానసిక శరీరక ఉల్లాసం కోసం ఏ రకమైన ఆటలు, సాంస్కృతిక కార్య క్రమాలను నిర్వహించటం లేదన్నారు. చాలా కళాశాలలు ప్రతి సంవత్సరం అఫ్లి యేషన్ రెన్యువల్ చేసుకోకపోయినా, సిఫ్టింగ్ పర్మిషన్ రాకపోయినా శ్రీ చైతన్య, నారాయణ, స్టెల్లా, సృజన, ఎస్‌వి వొకేషనల్, విజన్, శ్రీనివాస, నిధి, గ్లోబల్, వెంకటేశ్వర, మొదలగునవి నడుపుతున్నా రన్నారు. అలాంటి కళాశాలల పైన జిల్లా వ్యాప్తంగా విచారణ కమిటీవేసి విచారించాలని డిమాండ్ చేశారు. లేకపోతే విద్యార్థులతో కలెక్టరేట్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శులు అమర్, అంజి తదితరులు పాల్గొన్నారు.

విజన్ యాక్షన్ ప్లాన్ అమలు : మంత్రి టిజి. భరత్

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో విజన్ యాక్షన్ ప్లాన్ అమలు చేస్తున్నామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టిజి. భరత్ పేర్కొన్నారు. సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 26 జిల్లాల విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ కార్యాలయాలను, నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ కార్యాలయాలను వర్చువల్ విధానం ద్వారా ప్రారంభించి ప్రసంగించారు. కలెక్టరేట్‌లోని సిపిఒ ఆఫీసులో ఏర్పాటు చేసిన జిల్లావిజన్ యాక్షన్ ప్లాన్‌యూనిట్‌ను మంత్రి ఫిజికల్‌గా ప్రారంభించారు. స్వర్ణాంధ్ర ఎ- 2047 విజన్ ప్లాన్ అమలులో భాగంగా ఈ కార్యాలయాలను ప్రారంభించామని మంత్రి తెలిపారు. సిపిఒ హిమ ప్రభాకర్‌రాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సంతృప్తి పొందేలా సమస్యలు పరిష్కరించాలి

అర్జీదారులు సంతృప్తి పొందేలా సమస్యలను పరిష్కరించాలని హౌసింగ్ పిడి చిరంజీవి , స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వెంకటేశ్వర్లు , అనురాధ అధికారులను కోరారు. కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుండి వినతులను స్వీకరించారు. సిఎంఒ గ్రీవెన్స్‌లకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలని అధికారులను కోరారు.హౌసింగ్ పిడి చిరం జీవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వెంకటేశ్వర్లు, అనురాధ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వినతులను స్వీకరిస్తున్న ఎస్‌పి విక్రాంత్ పాటిల్

విచారించి న్యాయం చేస్తాం : ఎస్‌పి

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 95 ఫిర్యాదులు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ఫిర్యాదుల పరిష్కార వేదికకు అందిన ఫిర్యాదులపై అన్యాయం చేస్తామని జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ అన్నారు. కర్నూలు ఎస్‌పి క్యాంపు కార్యాలయంలో ఎస్‌పి విక్రాంత్ పాటిల్ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాది దారులతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మొత్తం 95 ఫిర్యాదులు వచ్చాయన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సంధర్భంగా కర్నూలు జిల్లా ఎస్‌పి హామీ ఇచ్చారు. ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి అడ్మిన్ హుస్సేన్ పీరా, సిఐలు పాల్గొన్నారు.



కమిషనర్‌కు సమ్మె నోటీసు ఇస్తున్న నాయకులు

కార్మికుల సమస్యలు న్యాయమైనవే

- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఈరన్న

ప్రజాశక్తి - ఆదోని

కార్మికుల సమస్యలు న్యాయమైనవేనని, పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఈరన్న డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు నిరసన కొనసాగిస్తామని మున్సిపల్ ఇంజినీరింగ్ కాంట్రాక్టు కార్మికులు స్పష్టం చేశారు. ఇంజినీరింగ్ కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26 వేలకు పెంచాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరసన సోమవారం ఆరో రోజుకు చేరింది. సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులతో కలిసి కమిషనర్ కృష్ణ, డిప్యూటీ ఇంజినీర్ రామమూర్తికి సమ్మె నోటీసు ఇచ్చారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఈరన్న, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు గోపాల్, తిప్పన్న, సహాయ కార్యదర్శి లక్ష్మన్న మాట్లాడారు. మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు అహ్మద్, పీరా, సోమన్న, దేవేంద్ర, కైలాస్, శివకుమార్, శివశంకర్, బాష, సీన, తిమ్మప్ప పాల్గొన్నారు.

నకిలీ బంగారంతో మోసం చేసిన

నలుగురు నిందితులు అరెస్టు

ప్రజాశక్తి - దేవనకొండ

నకిలీ బంగారంతో మండలంలోని గుండ్లకొండ గ్రామంలోని కప్పల రంగస్వామిని మోసం చేసేందుకు ప్రయత్నించిన నెల్లూరు జిల్లాకు చెందిన నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి సోమవారం పత్తికొండ మేజిస్ట్రేట్ ముందు హాజరు పరిచినట్లు సిఐ వంశీనాథ్ తెలిపారు. ఆయన వివరాల మేరకు... తమకు బంగారం దొరికిందని, మీరు ఏమైనా కొంటారా అని మాయమాటలు చెప్పి కప్పల రంగస్వామిని నమ్మించి ఆదివారం అతని వద్ద నుంచి రూ.1.12 లక్షలను తీసుకుని నకిలీ బంగారం ఇచ్చి అక్కడి నుంచి వెళ్లిపోతా భయపెట్టారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి వెంటనే నిందితుల కోసం బృందాలుగా విభజించి 24 గంటల్లోపు అరెస్టు చేసినట్లు సిఐ తెలిపారు. వారి వద్ద నుంచి నగదును రికవరి చేసి, రిమాండ్ నిమిత్తం పత్తికొండ మేజిస్ట్రేట్ ముందు హాజరు పరిచినట్లు చెప్పారు.

రైతులకు అవగాహన అవసరం

- బనవాసి శాస్త్రవేత్తలు

ప్రజాశక్తి - చిప్పగిరి

మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

వ్యవసాయంలో యాజమాన్య పద్ధతులు, సస్య రక్షణ చర్యలపై ప్రతి రైతుకూ అవగాహన ఉండాలని బనవాసి వ్యవసాయ శాస్త్రవేత్తలు పి.సుజాతమ్మ, కెవికె వై.మౌనిక, శ్రీచందన, ఎఒ జయలక్ష్మి తెలిపారు. సోమవారం మండలంలోని ఏరూరు గ్రామంలో సర్పంచి వెంకటమ్మ, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో రైతులకు యాజమాన్య పద్ధతులు, సస్య రక్షణపై అవగాహన కల్పించారు. వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కర్నూలు ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ పి.సుజాతమ్మ వరి, జొన్న సాగులో యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ గురించి తెలిపారు. ఎఒ జయలక్ష్మి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం, వ్యవసాయ శాఖ అందించే పథకాలు, సబ్సిడీ గురించి తెలిపారు. కెవికె శాస్త్రవేత్త డాక్టర్ వై.మౌనిక మిరప, ఉల్లి, పత్తి పంటల యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ గురించి వివరించారు. డాక్టర్ శ్రీచందన మాట్లాడుతూ... రైతులకు కెవికె బనవాసి అందించే సేవల గురించి వివరించారు. కెవికెలో రైతులకు అధిక దిగుబడి ఇచ్చే కంది, కొర్ర విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైతులకు కంది, శనగ, పత్తి, సాయిల్ శాంపిల్ కలెక్షన్ లిటరేచర్స్ ఇచ్చినట్లు చెప్పారు. ఎంపిఇఒ సుబ్బరాయుడు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం : ఎంపిడిఒ

ప్రజాశక్తి - ఆస్పరి

యోగాపై అవగాహన కల్పిస్తున్న ఎంపిడిఒ గీతావాణి

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, ప్రతి ఒక్కరూ జీవన శైలిలో యోగాను భాగం చేసుకోవాలని ఎంపిడిఒ గీతావాణి పేర్కొన్నారు. సోమవారం స్థానిక ప్రజా పరిషత్ కార్యాలయం నుంచి సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో కలిసి అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ అంబేద్కర్ విగ్రహానికి సర్పంచి రాధమ్మ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అందరూ యోగాను సాధన చేస్తే ఆరోగ్యానికి రక్షణగా ఉండటమే కాకుండా మెదడు చురుకుగా పని చేస్తుందని తెలిపారు. ఏపీవో రామకృష్ణ, ఐసిడిఎస్ సూపర్ వైజర్ పద్మ పాల్గొన్నారు.

మార్కెట్ యార్డు అభివృద్ధికి తోడ్పడాలి

- ఎమ్మెల్యే బివి.జయనాగేశ్వరరెడ్డి
- అట్టహాసంగా ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

నూతన పాలక వర్గం మార్కెట్ యార్డు అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వరరెడ్డి తెలిపారు. సోమవారం ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ యార్డు పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవం అట్టహాసంగా సాగింది. ఎమ్మెల్యే డాక్టర్ బీవీ ఆధ్వర్యంలో నూతన చైర్మన్ కురువ మల్లయ్య, వైస్ చైర్మన్ వాల్మీకి అంజనేయులుతో పాటు డైరెక్టర్లతో మార్కెట్ యార్డు సెక్రటరీ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ బీవీ మాట్లాడారు. ఎన్నికల్లో ఎవరెంత పని చేశారో గుర్తు పెట్టుకొని అందరి అభిప్రాయం మేరకు పదవులు ఇస్తున్నామని తెలిపారు. రానున్న రోజుల్లోనూ అనేక పదవులు రాబోతున్నాయని చెప్పారు. బీవీ.మోహన్ రెడ్డి కుటుంబం బీసీలను ఎప్పుడూ అగ్రస్థానంలో నిలబెడుతుందని తెలిపారు. అనంతరం టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి మాట్లాడారు. కర్నూలు పార్లమెంట్ పరిధిలో మాజీ మంత్రి బీవీ.మోహన్ రెడ్డి బీసీలను పైకి తెచ్చారని తెలిపారు. బడుగు, బలహీన వర్గాలకు పెద్దపీట వేశారని చెప్పారు. చైర్మన్ మల్లయ్య రైతుల్లా ఉన్నారని, వ్యాపారులు బాగుంటే రైతులు బాగుంటారని చెప్పారు. వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ, టిడిపి మంత్రాలయం ఇన్‌ఛార్జి రాఘవేంద్ర రెడ్డి, కురువ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప, గొర్రెల పెంపకందారుల సంఘం ఉమ్మడి జిల్లా చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్, జనసేన ఇన్‌ఛార్జీ రేఖ గౌడ్ మాట్లాడుతూ... ముఖ్యమంత్రి చంద్రబాబు బీసీలకు ప్రాధాన్యత ఇస్తారని తెలిపారు. కూటమి ప్రభుత్వం లో అన్ని పదవుల్లో అన్ని వర్గాలకు పెద్ద పీట వేస్తున్నారని, ఇందుకు నిదర్శనం ఎమ్మిగనూరు మార్కెట్ యార్డు నూతన పాలక వర్గమని చెప్పారు. అనంతరం మార్కెట్ కమిటీ చైర్మన్ కురువ మల్లయ్య, వైస్ చైర్మన్ బోయ అంజితో పాటు సభ్యులు బందారి లక్ష్మి, బోయ ప్రభాకర్, బోయ రామచంద్రమ్మ, జగళప్ప ఆల్తాహిం, కవిత, మద్దే దుబ్బన్న, నాగదిన్నె కరణం సుధీర్, సూగూరు షఫీన్, తెలుగు శశికళ, బోయ వెంకటేశ్వరమ్మ, ఫక్రుద్దీన్, జయలక్ష్మి, కమ్మరి వెంకటేష్ ఆచారి ఎమ్మెల్యే బీవీకి శుభాకాంక్షలు తెలిపారు. టిడిపి సీనియర్ నాయకులు బి.చంద్రశేఖర్, టౌన్ బ్యాంకు చైర్మన్ ఉరుకుందయ్య శెట్టి, కర్నూలు మార్కెట్ కమిటీ మాజీ మెంబర్ వెంకటరామిరెడ్డి, మల్లెల ఆల్ఫ్రెడ్ రాజు, ఖాసీంవలీ, బేతాళ బడే సాబ్, నజీర్ అహ్మద్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ బీవీ

'దోమల నియంత్రణకు చర్యలు చేపట్టాలి'

ప్రజాశక్తి - ఆదోని

దోమల వ్యాప్తి ద్వారానే వ్యాధులు సోకుతున్నాయని, నివారణ చర్యలు చేపట్టాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలో 42 వార్డుల్లో మురుగు కాలువలు శుభ్రం చేసి.. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేలా మున్సిపల్ అధికారులు శ్రద్ధ చూపాలని సిపిఎం పట్టణ కార్యదర్శి లక్ష్మన్న, పట్టణ కార్యదర్శి వర్గసభ్యులు గోపాల్, తిప్పన్న, పట్టణ కమిటీ సభ్యులు వీరేష్, మోహన్ కోరారు. సోమవారం మున్సిపల్ కమిషనర్ కృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో ప్రజలపై దోమలు దండయాత్ర చేస్తున్నాయని, డెంగీ, మలేరియా, చికున్ గున్యా వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని తెలిపారు. సీజనల్ వ్యాధులతో ప్రజలు వైద్యం కోసం ఆస్పత్రుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉందని, వర్షాకాలం ప్రారంభంలోనే మురుగు కాలువలు శుభ్రం చేయాలని డిమాండ్ చేశారు. దోమల నియంత్రణకు మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టణంలో ఫాగింగ్, హైపోద్రావణం, బ్లీచింగ్ పౌడర్ లాంటివి తరచూ చల్లించాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ కృష్ణ మాట్లాడుతూ... శానిటేషన్ పనులను తరచూ పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ఎక్కడైనా చెత్త పేరుకుపోయినా, కాలువలో నీరు పారకపోయినా తమకు సమాచారం ఇస్తే వెంటనే సమస్యను పరిష్కరిస్తామని నాయకులకు హామీ ఇచ్చారు.

కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరి

- ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్

ప్రజాశక్తి - ఆదోని

సాంకేతిక రంగంలో రాణించాలన్నా, ఉపాధి పొందాలన్నా కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరి అని ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ తెలిపారు. సోమవారం పట్టణంలోని పీపుల్స్ పాఠశాల ఫెయిత్ హోమ్‌లో శిక్షణ పొందిన విద్యార్థులకు హోమ్ నిర్వాహకులు ట్రస్టీ, బిషప్ డానియేల్ ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడారు. పేద విద్యార్థులకు కంప్యూటర్ బేసిక్స్ గురించి అవగాహన కలగాలంటే బేసిక్స్ గురించి తెలుసుకోవాలని అన్నారు. ఆవశ్యకతను గమనించి కంప్యూటర్ బేసిక్స్, స్పోకెన్ ఇంగ్లీష్ గురించి విద్యార్థులకు సమ్మర్ క్యాంప్ కోర్సు ఏర్పాటు చేయించామని తెలిపారు. కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులకు హోమ్ తరఫున ధ్రువీకరణ పత్రాలు అందజేశామన్నారు. ప్రతి ఒక్కరూ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఫెయిత్ హోమ్ మేనేజింగ్ ట్రస్టీ బిషప్ డానియల్ ప్రేమ్ కుమార్ మాట్లాడారు. సమ్మర్ క్యాంపునకు 7 గ్రామాల నుంచి 35 మంది విద్యార్థులు హాజరై శిక్షణ పొందారని తెలిపారు. విద్యార్థులకు అనుకూలమైన సమయాల్లో వారికి ఉపయోగపడే శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. శ్రీవాణి రెడ్డి, జొనాథన్ విక్లిఫ్, సంధ్య రాణి, దాస్, పాస్టర్ సోమన్న, పీపుల్స్ పాఠశాల సిబ్బంది సంగటి ప్రేమ్ కుమార్, లక్ష్మీ నాయుడు ఉన్నారు.

సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్

విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలి

- ఆర్‌టిసి డి ఎంకు ఎస్‌ఎఫ్‌ఐ వినతి

ప్రజాశక్తి - ఆదోని

చదువుకోవడం కోసం గ్రామాల నుంచి వచ్చే నిరుపేద విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు కోరారు. సోమవారం ఆర్‌టిసి డిపో మేనేజర్ రఫీకి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు, ఎస్‌ఎఫ్‌ఐ పట్టణ అధ్యక్షులు శేఖర్ మాట్లాడారు. ఈనెల 12 నుంచి పాఠశాలలు, కళాశాలలు పునఃప్రారంభమవుతున్నాయని తెలిపారు. ఆదోని డివిజన్ కేంద్రంలో ఉన్న కళాశాలలకు, పాఠశాలలకు వివిధ గ్రామాల నుంచి వందల మంది విద్యార్థులు వస్తారని చెప్పారు. గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులకు ప్రస్తుతం సరైన బస్సు సౌకర్యం లేకపోవడంతో సమయానికి కళాశాలలు, పాఠశాలలకు చేరుకోలేక పోతున్నారని తెలిపారు. ఎలాగైనా కళాశాలు, పాఠశాలకు వెళ్లాలని విద్యార్థులు ప్రమాదకరమైనా ఆటో ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారని చెప్పారు. ఇప్పటికే అనేకచోట్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక విద్యార్థి బస్సులు నడపాలని కోరారు. నాయకులు తరుణ్, మహేష్, ఉదయ్, మణి పాల్గొన్నారు.

BEFORE THE HON'BLE
CO-OPERATIVE TRIBUNAL
ANDHRA PRADESH AT : VIJAYAWADA
O.P.NO.70/2024

BETWEEN
Shriram Raghavendra Mutually Aided co-op thrift and credit Society Ltd.Regd Office : D.No-16-17, IInd Floor, Ucon Plaza, Kurnool-518001, Represented by The Manager, T.Guru Prasad S/o T.Veeranna. ...Petitioner

And

Imtiaz Baig, S/o Anwar Baig
H.No.56/46, Khandari Street,
Kurnool - 518001. ..Respondent

పై నెంబర్ పిటీషనులో రెస్పాండెంట్ అయిన మీకు పై O.P.No.70/2024 నోటీసులు పంపగా తీసుకొనక కాలయాపన చేయుచున్నందున ఈ పేపరు ప్రకటన ద్వారా పై పిటీషను సంగతులు తెలియ చేయవలసినదిగా పై కోర్టు వారు ఆదేశించి యున్నారు. కావున ది.19-06-2025 తేదిన ఉదయం గం.10.30 ని.లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని లేదా మీ న్యాయదావి ద్వారా గాని హాజరై మీ యొక్క అభ్యంతరములు తెలుపుకొన వలెను. లేనిచో మీ పరోక్షమున విచారించి తీర్మానించెదరని ఇందుమూలముగా తెలియచేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వులమేరకు)

వాయిదా తేది : 19-06-2025

B.SURYANARAYANA KUMAR
B.com., B.L., (BSNK)
Advocate
BSNK LAW ASSOCIATES
32-15-104, 1st Floor,
O-1, Classic Towers, Moghalrajpuram.
VIJAYAWADA-52010
Cell : 9848017859.

మెడికల్ నాగరాజుకు సన్మానం

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

జిల్లా మదారి కురువ, మదాసి కురువ సంఘం జిల్లా ఉపాధ్యక్షులుగా మెడికల్ నాగరాజు ఎన్నిక కావడంతో మండలంలోని పెద్దహరివాణం గ్రామానికి చెందిన యువకులు సన్మానించారు. సోమవారం గ్రామానికి ఆదోని శివకుమార్, బింగిపూజారి హుస్సేని, అనాజి రవికుమార్, పరమేష్, పూజారి బసప్ప, తిమ్మప్ప సన్మానించారు. సంఘాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు.

నాగరాజును సన్మానిస్తున్న యువకులు

మాన్యువల్ కౌన్సెలింగ్‌లోనే బదిలీలు చేపట్టాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎస్‌జిటి ఉపాధ్యాయులకు మాన్యువల్ కౌన్సెలింగ్ విధానంలోనే బదిలీలు నిర్వహించాలని యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు దావీదు, రాష్ట్ర నాయకులు ఎన్.నాగమణి కోరారు. సోమవారం వారు మాట్లాడారు. ఎంఇఒలు ఉపాధ్యాయులకు ఫోన్లు చేసి మానసికంగా ఒత్తిడి చేసే విధానాలు మానుకోవాలని, లేకపోతే ఎంఇఒ కార్యాలయాలకు తాళాలు వేసేందుకు కూడా వెనుకాడబోమని హెచ్చరించారు. యుటిఎఫ్ నాయకులు రాఘవేంద్ర, ఎం.నాగరాజు, కె.నాగరాజు, ఎం.రాజు, ఎం.సుధాకర్, దేవపాల్, నర్సింహులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

- కార్మిక సంఘాల నాయకులు

ప్రజాశక్తి- ఆలూరు

ప్రాణాలు త్యాగం చేసి నిర్మించుకున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీలో తొలగించిన 2,500 మంది కాంట్రాక్టు కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కెపి.నారాయణ స్వామి, ఎఐటియుసి తాలూకా కార్యదర్శి రంగన్న డిమాండ్ చేశారు. సోమవారం సిఐటియుసి, ఎఐటియుసి ఆధ్వర్యంలో ఆలూరులోని అంబేద్కర్ సర్కిల్‌లో రాస్తోరోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 32 మంది కార్మికులు ప్రాణ త్యాగం చేసి స్టీల్ ప్లాంటును ఆంధ్రప్రదేశ్‌కు ఆస్తిగా ఇచ్చారని, 52 మంది కమ్యూనిస్టు ఎమ్మెల్యేలు విశాఖ ఉక్కు కోసం రాజీనామాలు చేశారని కొనియాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రయివేటీకరణ చేయబోదని కేంద్రమంత్రి కుమారస్వామి పలుమార్లు హామీ ఇచ్చారని తెలిపారు. స్టీల్ ప్లాంట్‌ను కాపాడుతాం.. కార్మికులను ఎవరినీ తొలగించబోమని కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు హామీఇచ్చిందని చెప్పారు. కార్మికులను రక్షించుకుంటామని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ బహిరంగ సభలో హామీ ఇచ్చారని తెలిపారు. మే 20న ముందస్తు నోటీసులు ఇవ్వకుండా కాంట్రాక్టు కార్మికులను తొలగించారని చెప్పారు. కాంట్రాక్ట్ కార్మికులను పనిలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సిఐటియు నాయకులు ఈరన్న, నాగరాజు, ఈశ్వర్ గౌడ్, వీరేష్, విఠల్, గోవర్ధన్, ఎఐటియుసి నాయకులు సిద్ధప్ప, కార్మికులు పాల్గొన్నారు. **ఎమ్మిగనూరులో** కార్మిక సంఘాల ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. సిఐటియు తాలూకా కార్యదర్శి బి.రాముడు, ఐఎఫ్‌టియు తాలూకా కార్యదర్శి ఎస్.బాల రాజు, నాయకులు హనీఫ్, రైతు కూలీ సంఘం తాలూకా నాయకులు ఎం.సత్తన్న, బి.ఏసోబు, నాయకులు వేణు, రహిమాన్, జయన్న, బాబు, మోహిన్ పాల్గొన్నారు.

ఆలూరులో ధర్నా చేపడుతున్న కార్మిక సంఘాలు

ఎమ్మిగనూరులో...

ట్రాక్టర్ బోల్తా పడి బాలుడు మృతి

ప్రజాశక్తి - ఆస్పరి

మృతి చెందిన దొరబాబు (ఫైల్)

ట్రాక్టర్ బోల్తా పడి మండలంలోని కారుమంచి గ్రామానికి చెందిన బాలుడు బోయ ఆవుల దొరబాబు (12) మృతి చెందాడు. ఎస్ఐ మన్మథ విజయ్ వివరాల మేరకు... బోయ కిష్టప్ప, రాధమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. చిన్న కుమారుడు దొరబాబు కారుమంచి గ్రామ సమీపంలో ఉన్న కొండలో గరుసు లోడు వేసుకొని రావడానికి చిన్నాన్న వెంకటేష్‌తో కలిసి రోజులాగే సోమవారం వెంట వెళ్లాడు. లోడు వేసుకుని తిరిగి కొండ నుంచి దిగేటప్పుడు వాలుకు ట్రాక్టర్ కంట్రోల్ కాకపోవడంతో ట్రాలీపై ఉన్న దొరబాబు కిందికి దూకాడు. ట్రాక్టర్ అదుపుతప్పి దొరబాబుపై బోల్తా పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని ఆదోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పజెప్పారు. తల్లి బోయ రాధమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మన్మథ విజయ్ తెలిపారు.

మార్కెట్, రైతుల అభివృద్ధికి కృషి

- మార్కెట్ యార్డు డైరెక్టర్ దుబ్బన్న

ప్రజాశక్తి - నందవరం

దుబ్బన్న ప్రమాణ స్వీకారం

వ్యవసాయ మార్కెట్, రైతుల అభివృద్ధికి కృషి చేస్తానని మండలంలోని హాలహర్వి గ్రామానికి చెందిన మార్కెట్ యార్డు డైరెక్టర్ దుబ్బన్న (దావీదు) సోమవారం తెలిపారు. నూతనంగా కొలువుదీరిన మార్కెట్ యార్డు కమిటీలో ఆయనకు స్థానం లభించింది. సోమవారం ఆయన మార్కెట్ యార్డు డైరెక్టర్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ అవకాశం కల్పించినందుకు ఆయన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎంఆర్‌పిఎస్ సన్మానం : మండలంలోని హాలహర్వి గ్రామానికి చెందిన టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షులు మద్రి దావీదు మార్కెట్ యార్డు డైరెక్టర్‌గా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర నాయకులు జి.ఆనంద్ చైతన్య మాదిగ, బేడ, బుడగ జంగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రుద్రాక్షల దస్తగిరి ఆధ్వర్యంలో భారీ గజమాలతో సన్మానించారు. దావీదు ఎంఆర్‌పిఎస్ ఆవిర్భావం నుంచి ఎస్సీ వర్గీకరణ ఉద్యమం కోసం అలుపెరుగని పోరాటాలు చేస్తూ టిడిపి రాజకీయాల్లో ప్రవేశించి అంచలంచెలుగా ఎదగడం అభినందనీయమన్నారు. దావీదు భవిష్యత్తులో మరిన్ని పదవులు అలంకరించి దళిత వర్గాల అభ్యున్నతికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఎంఆర్‌పిఎస్ జిల్లా నాయకులు కోడుమూరు ఆంధ్రయ్య, కప్పట్రాళ్ల లక్ష్మన్న, కనకవీడు రాజు, కుళ్లూరు ఇస్సాక్ పాల్గొన్నారు.



సన్మానిస్తున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

త్వరలోనే టిడిపికి రాజీనామా

- మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మాధవరావు దేశాయ్

ప్రజాశక్తి - నందవరం

టిడిపికి, పార్టీ సభ్యత్వానికి త్వరలోనే రాజీనామా చేస్తున్నట్లు టిడిపి సీనియర్ నాయకులు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మాధవరావు దేశాయ్ తెలిపారు. మండలంలో చక్రం తిప్పిన నాయకులు, ప్రజాదరణ ఉన్న నాయకులు మాధవరావు దేశాయ్ ఈ నిర్ణయం ప్రకటించడం చర్చనీయాంశంగా మారింది. మొన్న జరిగిన ఎన్నికల్లో టిడిపి గెలుపునకు ఆయన విశేషమైన కృషి చేశారని టిడిపి కార్యకర్తలు అభిప్రాయపడ్డారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. పార్టీ అధికారంలో లేనప్పుడు కష్టపడి పని చేసిన నాయకులకు ప్రస్తుతం పార్టీలో గుర్తింపు లేదని తెలిపారు. కేవలం ధనబలం ఉన్న వ్యక్తులకు మాత్రమే పార్టీలో గుర్తింపు ఉందని మండిపడ్డారు. గతంలో పార్టీలో కనపడని వారికి, వేరే పార్టీ నుంచి ఎన్నికల సమయంలో, ఎన్నికల అనంతరం వచ్చిన వారికి నామినేటెడ్ పదవులు ఇస్తున్నారని తెలిపారు. అలాంటి వ్యక్తులకు అన్ని విధాలుగా పార్టీ అండదండలు ఉన్నాయని చెప్పారు. కష్టపడిన వారికి ఇక్కడ విలువలేదని ఆయన బాధను వ్యక్తం చేశారు. ఇతర పార్టీల నుంచి వచ్చిన వ్యక్తులు పెత్తనం చలాయిస్తూ.. కొంతమంది వ్యక్తుల అండదండలతో కొన్ని రకాల దందాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. అలాంటి వారిని ప్రోత్సహిస్తూ, వారికి పదవుల కట్ట పెట్టడం, పార్టీని నమ్ముకుంటూ పార్టీకి సేవలు చేసిన వ్యక్తులను దూరం పెట్టడం బాధాకరమైన విషయమని మండిపడ్డారు. నియోజకవర్గంలో జరిగే విషయాలను ప్రజలందరూ గమనిస్తున్నారని తెలిపారు. తమ అనుచరులు, మండలంలో ఉన్న టిడిపి కార్యకర్తలు, నాయకులతో మాట్లాడి తుది నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

మహారాజశ్రీ గౌరవనీయులైన అదనపు సీనియర్ సివిల్ జడ్జి
కోర్టు :: కర్నూలు
O.S.No.80 OF 2024
కోర్టు వారి ఉత్తర్వు / సూచనల మేరకు

జంగం దినేష్ కుమార్. ...వాది

Vs.

B.హరి ప్రసాద్ నాయుడు మరియు ఇతరులు. ...ప్రతివాదులు

Summons to the Defendant No.2:

B. నాగన్న, తండ్రి: B.శరబన్న,
ఇంటి నెం.4-224-2, ప్లాటు నెం.636 పక్కన,
శిల్ప సింగపూర్ టౌన్షిప్, కర్నూలు, 518007.

పై వాది, పై కోర్టు నందు ప్రతివాది నెం.2 అయిన మిమ్ములను రిజిస్టర్డ్ సేల్ డీడ్ రద్దుపరుచుటకు దాఖలు చేసిన దావాలో ఒక ప్రతివాదిగా చేర్చారు. పైన కనబరచిన కేసులో ప్రతివాది నెం.2 అయిన నీవు ప్రతివాది నెం.1 తో పాటు అదే ఇంట్లో ఉన్నపట్టికి, నీకు ఎన్ని సార్లు సమన్లు పంపినను నీవు తీస్కోకుండా తప్పించుకోవడం వలన కోర్టు వారు పై కేసును 25-06-2025 న నీ హాజరు నిమిత్తం వాయిదా వేసియున్నారు. కావున నీవు తేదీ 25-06-2025 నాడు ఉదయం గం.10.30ని.లకు గౌరవనీయులైన పై కోర్టు వారి ఎదుట ఖుద్దున హాజరై నీ అభ్యంతరములు స్వయంగా కానీ లేదా నీ తరపు న్యాయవాది ద్వారా కాని తెలియజేసుకోనగలరు. లేనిచో మీ పరోక్షమున కేసు తీర్మానించబడును.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేదీ : 25-06-2025
కర్నూలు.

జి. మణి కుమార్, B.A., LL.B. (Hons.), LL.M.,
న్యాయవాది,
#40-790/10A, నెహ్రూ నగర్, కర్నూలు, 518004.
సెల్: 7075775222
Email: manikumarg.adv@gmail.com

'పది' విద్యార్థులకు పురస్కారం

ప్రజాశక్తి - కౌతాళం

2024-25 విద్యా సంవత్సరానికి గాను పదో తరగతి ఫలితాల్లో మండలంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం 'షైనింగ్ స్టార్' పురస్కారాలను అందజేసింది. డిఇఒ శామ్యూల్ పాల్ ఆధ్వర్యంలో జెసి డాక్టర్ బి.నవ్య చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారని ప్రతిభ స్కూల్ కరస్పాండెంట్ సయ్యద్ దూద్ బాష, సెక్రటరీ మైనుద్దీన్ తెలిపారు. సోమవారం వారు మాట్లాడారు. కర్నూలు నగరంలోని బళ్లారి చౌరస్తా సమీపంలో ఉన్న పుష్ప రాజ్ ఫంక్షన్ హాలులో విద్యార్థులకు రూ.20 వేల నగదుతో పాటు ప్రశంసాపత్రం అందజేసినట్లు తెలిపారు. మండలంలోని ప్రతిభ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థి దుర్గా శివప్రసాద్ 564 మార్కులు, సారిక 516 మార్కులు, కౌతాళం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన మొగతుల సురేష్ 505 మార్కులు, హాల్వి, బదినే హాల్ విద్యార్థులతో కలిపి మండలంలో ఐదుగురు విద్యార్థులకు షైనింగ్ స్టార్ పురస్కారాలతో అభినందించింది.

నందవరం : నందవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి జగతాప్ అజయ్ కుమార్ పురస్కారం అందుకున్నారు. నందవరం బాలుర వసతి గృహం వార్డెన్ క్రాంతి కుమార్ మాట్లాడారు. తమ హాస్టల్‌కు చెందిన విద్యార్థి అజయ్ కుమార్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకుంటూ 535 మార్కులు సాధించారని తెలిపారు. కర్నూలులో జరిగిన షైనింగ్ స్టార్ అవార్డు కార్యక్రమంలో ప్రతిభ అవార్డును అందుకున్నట్లు చెప్పారు. డిఇఒ శ్యామూల్‌పాల్, జెసి నవ్య చేతుల మీదుగా అవార్డు అందుకున్నట్లు తెలిపారు. విద్యార్థికి రూ.20 వేల నగదు, మెడల్, ప్రశంసాపత్రం అందించినట్లు చెప్పారు.

గోనెగండ్ల : షైనింగ్ స్టార్ అవార్డుకు గోనెగండ్ల ఎపి మోడల్ పాఠశాల విద్యార్థి టి.ప్రవీణ్ ఎంపికైనట్లు ప్రిన్సిపల్ షాహినా పర్వీన్ తెలిపారు. ప్రవీణ్ పదో తరగతిలో 549 మార్కులు సాధించి పాఠశాల టాపర్‌గా నిలిచాడు. రాష్ట్ర మంత్రి టిజి.భరత్, జెసి బి.నవ్య, డిఇఒ శామ్యూల్ పాల్‌లు విద్యార్థి ప్రవీణ్‌కు రూ.20 వేల నగదు, సర్టిఫికెట్, మెడల్‌ను అందజేసినట్లు తెలిపారు.

మంత్రాలయం : పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాల నుంచి ఐదుగురు విద్యార్థులు ప్రభుత్వం ద్వారా అవార్డులు అందుకోవడం గర్వంగా ఉందని శ్రీవైష్ణవి పాఠశాల కరస్పాండెంట్ గంగాధర్ రెడ్డి, ప్రిన్సిపల్ ఎస్.రాఘవేంద్ర తెలిపారు. కరస్పాండెంట్ గంగాధర్‌రెడ్డి మాట్లాడారు. క్రమ శిక్షణతో చదివి ఉత్తమ మార్కులు సాధించి గుర్తింపు తెచ్చిన విద్యార్థులు తమ పాఠశాలలో ఉండడం గర్వంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. శ్రీవైష్ణవి ఇంగ్లీష్ మీడియం స్కూల్ నుంచి వైష్ణవ సంజన, జంగం రష్మిత, వంకదారి గురుప్రసన్న, పేట మల్లికార్జున గౌడ్, కురువ జయరాముడును తనతో పాటు ప్రిన్సిపల్ ఎస్.రాఘవేంద్ర, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించినట్లు పేర్కొన్నారు. రానున్న రోజుల్లో తమ పాఠశాల నుంచి మెరుగైన ఫలితాలు సాధించి ఇలాంటి అవార్డులను ఎక్కువ మంది విద్యార్థులు పొందే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఆలూరు : మండలంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని బి.కావ్య 585, ప్రభుత్వ బాయ్స్-1 విద్యార్థి శ్రీకాంత్ 577, మోడల్ స్కూల్ విద్యార్థిని ప్రవల్లిక 549, సెయింట్ జాన్స్ ప్రయివేట్ స్కూల్ విద్యార్థి సతీష్ 575 మార్కుల సాధించగా జెసి నవ్య, డిఇఒ శ్యామూల్ పాల్ చేతుల మీదుగా అవార్డులను అందించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుజాత, చౌడయ్య తెలిపారు.

హోళగుంద : పదో తరగతి ఫలితాల్లో మండల టాపర్లుగా నిలిచిన హోళగుంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంఎస్.సందేశ్, సింగం ప్రవల్లిక, ఫాతిమాకు ప్రశంసా పత్రాలు, రూ.20 వేల నగదు అందజేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కబీర్ సాబ్ తెలిపారు.

ఆలూరు

హోళగుంద

మంత్రాలయం...

కౌతాళం : అవార్డు అందుకున్న విద్యార్థి

నందవరం : అవార్డు అందుకున్న విద్యార్థి

ఘనంగా బాలకృష్ణ పుట్టినరోజు వేడుకలు

- అభిమానుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

కేక్ కట్ చేస్తున్న నాయకులు, అభిమానులు

ప్రజాశక్తి - కౌతాళం

ప్రముఖ సినీనటుడు నందమూరి బాలకృష్ణ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. సోమవారం అభిమాన సంఘం అధ్యక్షులు రహమాన్ ఆధ్వర్యంలో వాలంటీరు ద్వారా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా హాజరైన టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు జి.చెన్న బసప్ప, బాపురం శివ మోహన్ రెడ్డి, తెలుగు రైతు జిల్లా కార్యదర్శి వెంకటపతిరాజు కేక్ కట్ చేసి బాలయ్య పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బాలకృష్ణ అభిమానులు రక్తదాన శిబిరం ఏర్పాటు సామాజిక సేవలో ముందు ఉంటారని, ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు ఎన్నో జరపాలని కోరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదానం శిబిరం ద్వారా తల సేమియా చిన్నారుల కోసం రక్తం సేకరించినట్లు తెలిపారు. పేదలకు భోజన సౌకర్యం ఏర్పాటు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రమేష్ గౌడ్, దొడ్డన్న గౌడ్, కురుగోడు, నీలకంఠ రెడ్డి, గుండప్ప, సర్పంచి రవి, ఈరప్ప, రాజనందు, సిద్దు గొట్టయ్య, చౌదరి సోమశేఖర్, రాజబాబు, మంజునాథ్, బసవ, బాష, భీమయ్య, హుగ్గి నాగ, హోటల్ బసవరాజ్ పాల్గొన్నారు.

మహారాజశ్రీ సివిల్ జడ్జి కోర్టు (జూనియర్ డివిజన్)
:: ఆలూరు
O.S.No. 207/2023

Between:
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, హోళగుంద బ్రాంచ్
Reptd., by బ్రాంచ్ మేనేజర్, హోళగుంద. ...వాది

V/s.

ముడుమల గుర్తి సురేంద్ర బాబు. ...ప్రతివాది

ప్రతివాదికి దావా సమన్లు

To
ముడుమల గుర్తి సురేంద్ర బాబు,
S/o ఎమ్.తిప్పన్న R/o H.No.18-210-6-12,
మండల తహశీల్దారు కార్యాలయం దగ్గర,
కోడుమూరు - 518464, కర్నూలు జిల్లా.
సెల్ ఫోన్: 9966792612

పై తెలిపిన వాది/బ్యాంకువారు, ప్రతివాది అయిన మీపైన పై కోర్టులో పర్సనల్ లోన్ బాపతు వసూలు నిమిత్తం దావా దాఖలు చేసియున్నారు. పై కోర్టు నుండి ప్రతివాది అయిన నీకు చాలా సార్లు సమన్లు పంపిననూ తీసుకోనందున కోర్టు వారి ఆదేశాల మేరకు ఈ పత్రికా ప్రకటన ద్వారా తెలియజేయడమేమనగా పై కేసు వాయిదా తేది:30-06-2025 ఉదయం 10.30 గంటలకు ప్రతివాది అయిన నీవు కోర్టు ముందు హాజరు కావలెనని, నీ తరపున ఏమైనా ఆక్షేపణలు పున్నయెడల నీవు ఖుద్దుగా గాని, నీ వకీలు ద్వారా గాని కోర్టుకు హాజరై మీ అభ్యంతరాలను తెలుపవచ్చును. ప్రతివాది అయిన నీవు హాజరు కాని యెడల పై కోర్టు వారు పై కేసులో వాది పరముగా నీ పరోక్షమున తీర్మానము చేయుదురని ఈ పత్రికా ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

//కోర్టు వారి ఆర్డరు మేరకు//

వాయిదా తేది : 30-06-2025

శ్రీమతి ఎస్. బాల త్రివేణి, B.Sc., B.L.,
వాది తరపు అడ్వోకేట్,
ఆదోని-518301.
సెల్ నెం.9246577201